# మేలుకొలుపులు

రచన: "మాన్స"

తెల్లారుతూనే బాంబర్లు తిరిగి వచ్చేస్తున్న శబ్దము!

కిటికీ కర్టెన్ పక్కకు వొత్తిగించి చూడు. సూర్యుడు చడీ చప్పుడూ కాకుండా బాదం చెట్లని తన కాంతితో ఎలా తినేస్తున్నాడో!

చెయ్యవలసిన పనులున్నాయి...కలుసుకో వలసిన స్నేహితులున్నారు. నేడు సంతోషాని కేర్పరుచుకొన్న దినము...నీలి ఆకాశము అద్దపు నదిలో తన అందాన్ని చూచుకొంటోంది.

కాఫీ కప్పు పక్కన నిన్నటి లేఖ కోసం వెతుకుతూంటే నేడు మరి మూడు ఉత్తరాలు.

రాత్రి అంతా కూడా ఏమిటో వింతకలలు... నేను దూరపు యుద్ధరంగానికి పోతున్నానా? లేకపోతే తిరిగి వచ్చేస్తున్నానా? పాడుపడిపోయిన అట్టేషన్ ఏదేశం లోనిది?

గతకాలపు నామిత్రులు అంతా జ్ఞాపకానికి వస్తున్నారు......ఐనా వారినాడు వేయిమైళ్ళ దూరములో...బతికే వున్నారేమో! ఎవరికి తెలుసు?

మృత్యువు నాకోసము వస్తే?...రావచ్చు ఏ క్షణమయినా...ఏరాత్రో బాంబులూ...నిప్పుల వర్షము...

ఆ చీకటి మరచిపో...

నరాల్లో ఉబుకుల్ని రేపుతాయి ప్రమాదపు ఆలోచనలు...చూడు వసంత వృక్షాలూ...... చక్కగా పరిగెడుతూపోయే మేఘాలూ... ఇంకా ఆలోచనలకన్న విలువైనవీ...

చూడు పైలట్లు ఎంతధీమాగా మార్చి చేస్తున్నారో...ఉన్నంతకాలమే అనుభవం!

చెయ్యవలసిన పనులున్నాయి. టెలిఫోను సమాధానాలియ్యాలి...లేఖలు పోస్టుచెయ్యాలి. కొత్తసమస్యలు ఎదురుకోవాలి.

దినము యవ్వనములో వుంది. సరదాగా భోజనాలు ముగిస్తూంటే మాటలవర్షాని కంతు లేకపోతోంది...యుద్ధగతి ముందు ఎలా వుంటుందో...నిన్నరాత్రి కొత్తగా వచ్చిన సినీమా బాగోగులు...ఒక సేనాని వింత కథ...మ్యూర్ఫే జీవితము...హఠాత్తుగా సంగీతం ఆగిపోతే...

చేసేదేమీ మరి లేకపోతే...

గుడ్ నైట్...

తర్వాత గుడ్ బై...

దేవుడు నిన్ను రక్షిస్తాడు లే!

తాళంతీసి కొత్తగా వచ్చిన ఉత్తరాలు ఆతృతతో వెతుకు...కవర్లూ స్టాంపులూ అన్నీ ఏమిటో అరుస్తున్నాయి......కాని కావలసిన మాటలు మాత్రము నిశ్శబ్దము!

గాలి పెద్దగా వీస్తోంది. నిన్న కణకణలాడ్తూ మండిన కుంపట్లలో నేడు బూడిద...గాలి కిటికీలు తెరుస్తూ వీస్తోంది...ఓపికపట్టి ఆగితే?... కాని యెంతకాలం?

తిరిగిరా...చక్కని స్వప్నాలున్నాయి నా దగ్గర...మనం యింకా యెంతో నిర్మించుకోవాలి...నా నవ్వులో నమ్మకము నాపక్క లేకపోతే...

నా సమాధానాలూ...

వేడి శరీరం నాపక్క లేకపోతే...

నేను భూమిమీద నడుస్తున్నట్లే లేదు... గాలిలోనికి...చీకటిపడుతూనే బాంబర్లు వెడుతూన్న శబ్దము!